18 నుంచి వివిధ స్వల్పకాలిక కోర్సుల్లో ఉచిత శిక్షణ

భోజనం, హాస్టల్ వసతి పూర్తిగా ఉచితం

ప్రజాశక్తి - ఏలూరు

సత్రంపాడులోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో ఈ నెల 18 నుండి ఉచితంగా సీసీ కెమెరా రిపేరింగ్‌లో 13 రోజులు (పురుషులకు), పుట్టగొడుగుల పెంపకంలో 10 రోజులు (మహిళలకు, పురుషులకు), బ్యూటీపార్లర్‌కు సంబంధించి 31 రోజులు (మహిళలకు) శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎం.ఫణికిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణా సమయంలో భోజనం, హాస్టల్ వసతి పూర్తిగా ఉచితమని, శిక్షణ పూర్తి చేసిన వారికి ఉచితంగా టూల్ కిట్ ఇస్తారని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు బ్యాంకు నుండి సర్టిఫికెట్, అర్హులైన అభ్యర్థులకు ముద్ర రుణానికి సిఫార్సు చేస్తారని తెలిపారు.

కార్పొరేషన్ రుణాలు ఇచ్చేనా..!

ఎస్‌సి, బిసి, కాపు కార్పొరేషన్ రుణాల మంజూరుపై అయోమయం

దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించి అర్థాంతరంగా నిలిపివేత

రెండు జిల్లాల్లో ఐదు వేల యూనిట్లు ఇస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటనలు

ఉపాధి కోసం వేలాది మంది అర్హుల ఎదురుచూపు

సామాన్యుల గోడు పట్టించుకోని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం ఎస్‌సి, బిసి, కాపు కార్పొరేషన్ రుణాలపై వ్యవహరిస్తున్న తీరు జనాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కార్పొరేషన్ రుణం మంజూరైతే ఉపాధి దొరుకుతుందని ఎదురుచూస్తున్న వేలాది మంది పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత వైసిపి ప్రభుత్వం కార్పొరేషన్ రుణాలు ఇవ్వకుండా ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, బిసి, కాపు సామాజిక తరగతులను మోసం చేసిందంటూ కూటమి నేతలు ఎన్నికల్లో విమర్శలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే మళ్లీ కార్పొరేషన్ రుణాలు పునరుద్ధరిస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఈ ఏడాది మార్చిలో బిసి, కాపు కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేశారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో బిసి కార్పొరేషన్ కింద 3,600 యూనిట్లు, కాపు కార్పొరేషన్ కింద

1,387 యూనిట్లు, ఇడబ్ల్యూఎస్ కోటా కింద 215 యూనిట్లు మంజూరు చేసినట్లు ప్రకటనలు సైతం ఇచ్చారు. మార్చి పదో తేదీ నుంచి 20వ తేదీ వరకూ దరఖాస్తుల స్వీకరణ సైతం చేపట్టారు. దాదాపు 25 వేలకుపైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తేల్చారు. దరఖాస్తుదారులకు మండల పరిషత్ అధికారులు ఇంటర్వ్యూల ప్రక్రియ సైతం పూర్తి చేశారు. ఇంకేముంది కార్పొరేషన్ రుణం వచ్చేసినట్లే అని అంతా అనుకున్నారు. అదే సమయంలో ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. మే పదో తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. దాదాపు మూడు వేల దరఖాస్తులు వరకూ వచ్చినట్లు లెక్కలు వేశారు. ఏం జరిగిందో, ఏమో తెలీదు హఠాత్తుగా కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల స్వీకరణను ప్రభుత్వం నిలిపివేసింది. ఎందుకు నిలిపివేశారో కారణాలు సైతం చెప్పలేదు. సాంకేతిక కారణాల వల్ల నిలిపివేసినట్లు చెబుతూ మసిపూసి మారేడు కాయ చేస్తున్న పరిస్థితి ఉంది. కార్పొరేషన్ రుణాల ప్రక్రియను నిలిపివేసి దాదాపు మూడు నెలలు కావస్తోంది. ఇప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా లేకుండాపోయింది.

రుణాలిచ్చేనా అంటూ అనుమానాలు

గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఒక్క కార్పొరేషన్ రుణమూ ఇవ్వలేదు. ఎస్‌సి, బిసి, కాపులకు అందిన సంక్షేమ పథకాల సొమ్మును లెక్కలు చెబుతూ మభ్యపెట్టేందుకు ప్రయత్నించింది. దీంతో ఆయా సామాజిక తరగతుల నుంచి వైసిపి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. కార్పొరేషన్ రుణాలపై సోషల్ మీడియాలో పెద్దఎత్తున విమర్శలు సైతం వెల్లువెత్తాయి. 2019కు ముందు పాలించిన ప్రభుత్వాలు కార్పొరేషన్ రుణాలకు పెద్దపీట వేస్తూ వచ్చాయి. దీంతో ఎన్నో కుటుంబాలు వ్యాపారాలకు సంబంధించిన యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందాయి. ఇన్నోవా కార్లు వంటివి సైతం కార్పొరేషన్ రుణాల కింద మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ కార్పొరేషన్ రుణాలపై అంతా ఆశలు పెట్టుకున్నారు. నోటిఫికేషన్ ఇచ్చినట్లే ఇచ్చి ప్రభుత్వం నిలిపివేసింది. సబ్సిడీపై కార్పొరేషన్ రుణం వస్తే యూనిట్ ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందవచ్చునని వేలాది మంది కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయింది. ఇప్పటి వరకూ కార్పొరేషన్ రుణాల వ్యవహారం ముందుకు సాగని పరిస్థితి ఉంది. కార్పొరేషన్ రుణాలపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకుని మంజూరు చేయాలని వేలాది మంది కోరుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఎస్‌సి, బిసి, కాపు సామాజిక తరగతుల్లోని యువతకు న్యాయం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటుందో, లేదో వేచిచూడాలి.

ఎస్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రజాస్వామ్యానికి ప్రమాదం అని, ఓటర్ల హక్కును హరించే ఎస్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి లొంగిపోయే వైఖరిని ఎన్నికల కమిషన్ మార్చుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మత ప్రాతిపదికన పౌరులను విభజించే బిజెపి విధానాలను ప్రజలు ఐక్యంగా ప్రతిఘటించాలని, పౌరుల ఓటు హక్కును ప్రశ్నించే బీహార్‌లో కేంద్ర ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ను రద్దు చేయాలని, స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం కేంద్రంలోని బిజెపికి తొత్తుగా మారడం తగదని, ఓటర్ల నమోదుకు పౌరసత్వంతో ముడి పెట్టరాదని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద గల డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్నుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల కమిషన్ రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కును తొలగించాలని ఎస్ఐఆర్‌ను చేపడుతున్నారని, సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదన్నారు. ఎన్నికల సందర్భంగా ఓటర్ల జాబితా సరి చేయడం, అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించడం, దొంగ ఓట్లను తొలగించడం చేయాల్సిన ఎన్నికల కమిషన్ బీహార్‌లో ఎన్నికల సందర్భంగా బిజెపి అనుకూల ప్రభుత్వాన్ని గెలిపించడం కోసం ఎస్ఐఆర్‌ను తీసుకొచ్చిందని విమర్శించారు. ఓటు హక్కుకు ఆధార్, పాన్, రేషన్ తదితర గుర్తింపు కార్డులు చెల్లవని, కేవలం పౌరసత్వానికి సంబంధించిన రుజువులు మాత్రమే కావాలని అడుగుతూ పౌరసత్వ చట్ట సవరణ (సిఎఎ), జాతీయ పౌరసత్వ రిజిస్టర్ (ఎన్ఆర్‌సి) చట్టాలను ఎస్ఐఆర్ పేరుతో దొడ్డిదారిన అమలు చేయడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, దానికి ఎన్నికల కమిషన్ తోడ్పడుతుందని విమర్శించారు. ఈ రకమైన వైఖరితో కేవలం బీహార్‌లోనే దాదాపు 65 లక్షల ఓట్లను తొలగించారని తెలిపారు. మరోపక్క కర్నాటకలోని మహదేవపూర్ ఎంపీ స్థానంలో లక్ష పది వేల దొంగ ఓట్లు ఉన్నాయని పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తెలిపిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీహార్‌లో ఓట్లు తొలగించడం, కర్నాటకలో దొంగ ఓట్లు చేర్పించడం చూస్తుంటే కేవలం బిజెపిని గెలిపించడానికి ఎన్నికల కమిషన్ పని చేస్తుందనే విషయం అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించాలని, దొంగ ఓట్లను వెంటనే తొలగించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, పి.రామకృష్ణ, ఏలూరు నగర కార్యదర్శి పి.రవికుమార్, నేతలు ఎ.శ్యామలరాణి, ఎం.ఇస్సాక్, కనకారావు, కోటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

4, 5, 6 తేదీల్లో

నూజివీడులో సిఐటియు 13వ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

సిఐటియు జిల్లా మహాసభ కరపత్రాన్ని స్థానిక సుందరయ్య భవనంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ సిఐటియు ఏలూరు జిల్లా 13వ మహాసభ తొలిసారి నూజివీడు పట్టణంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 4, 5, 6 తేదీల్లో ఈ మహాసభ జరుగుతుందన్నారు. 1970 నుండి సిఐటియు ఉద్యోగులు, కార్మికుల హక్కులతోపాటు దేశ ప్రయోజనాల కోసం పని చేస్తుందన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రయివేటీకరణ, సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు చేసిందన్నారు. ఈ మహాసభకు 500 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్ఆర్.హనుమానులు, జి.వెంకటేశ్వరరావు, రంగారావు, అప్పారావు, ఆదిలక్ష్మి, జయలక్ష్మి, దేవదాస్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు

ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నేడు ర్యాలీ, సభ

అభివాదం చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘాల నేతలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఈ నెల తొమ్మిదో తేదీ శనివారం నాడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘాలు పిలుపునిచ్చాయి. స్థానిక మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ, సభ నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ చట్టాలపై దాడి చేస్తున్నాయన్నారు. గిరిజన ప్రాంతంలో ఉన్న భూములను కార్పొరేట్లకు అప్పగించడానికి ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. జిఒ నెం.3 స్థానంలో ఏజెన్సీ ఉద్యోగ నియామక చట్టం చేయాలన్నారు. అటవీ హక్కుల చట్టం-2006 ప్రకారం గిరిజనుల సాగులో ఉన్న భూములకు ఈ నెల తొమ్మిదో తేదీన పట్టాలు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుట్టాయగూడెం తహశీల్దార్ కార్యాలయం నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు ర్యాలీ చేపట్టి, అనంతరం అక్కడ సభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు ఫిలిప్స్, పోలోజు నాగేశ్వరరావు, కురసం భీమరాజు, తలం రాజు, కుంజా శ్రీరాములు, గుజ్జు డేవిడ్‌రాజు, నేతి ఇస్సాక్, జి.ఏసేబు తదితరులు పాల్గొన్నారు.

వీడని సాగునీటి కష్టాలు

ఎండిపోతున్న వరిపైరు

శివారు భూముల రైతులు లబోదిబో

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఖరీఫ్ సాగునీటి కష్టాలు రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. ఇంకా మండల శివారు గ్రామాల్లోని గరువు భూములకు సాగునీరు పారలేదు. దీంతో పలు ప్రాంతాల్లోని చేలు ఎండిపోతున్నాయి. రెండు వారాల క్రితం తుపాన్ ప్రభావంతో మండలంలో అడపాదడపా వర్షం కురిసినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఇంకనూ రైతులను నీటి కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. మండలవ్యాప్తంగా వరి నాట్లు చాలా వరకూ పూర్తి కావొచ్చాయి. అయితే శివారు గరువు గ్రామాల్లో భూములకు నీరు ఇంకా పూర్తిస్థాయిలో అందడం లేదు. నీటి కొరతతో వెదజల్లిన చేలల్లో పైరు ఎండిపోయే పరిస్థితులు తలెత్తుతున్నాయి. పది రోజులుగా మండలంలో ఎండలు మండిపోవడంతో చేలల్లో నీరు ఆవిరైపోతుంది. సాగునీటి కొరతతో నాట్లు వేసిన పైరును కాపాడుకునేందుకు రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పోల్‌రాజు కెనాల్ పరిధిలోని చిగురుకోట, నరసన్నపాలెం, చినకామనపూడి, పెదకామనపూడి, వడాలి, చినపాలపర్రు అన్నవరం, సిబి కెనాల్ పరిధిలో బొమ్మినంపాడు, కొరగుంటపాలెం, రాజానగరం తదితర గ్రామాల్లోని భూములకు సాగునీరు అందడం లేదు. దీంతో వరిచేలు ఎర్రబారి ఎండిపోతున్నాయి. పైగ్రామాల్లోని భూములకు సాగునీరు అందించేందుకు జలవనరుల శాఖ అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. కాల్వల వెంట పర్యటిస్తూ నీటి చౌర్యం జరగకుండా చర్యలు చేపట్టారు. అయినా ప్రధాన పంట కాలువలకు ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయకపోవడంతో గరువు భూములకు నీరు ఎక్కడం లేదు. దీంతో ఈ ఆయకట్టు భూముల రైతులు బ్రాంచ్ కాలువలు, మురుగు కాలువలు, పంట బోదెల్లో ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసుకుని పొలాలకు నీటిని తోడుకుంటూ వరి పైరును కాపాడుకుంటున్నారు. దీంతో రైతులకు అదనంగా ఆయిల్ ఖర్చు, ఇంజిన్ అద్దె, కూలి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని రైతులు వాపోతున్నారు. కాల్వ నుంచి ఆయిల్ ఇంజిన్ ద్వారా ఒక ఎకరం తడపడానికి ఆయిల్ ఖర్చు, ఇంజిన్ అద్దె, మనిషి కూలి కలిపి రోజుకు రూ.5 వేలు అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదల చేసే నీరు నియోజకవర్గ శివారు గ్రామాల వ్యవసాయ భూములకు అందడం లేదు. దీంతో సాగునీటి కష్టాలతో రైతులు సతమతమవుతున్నారు. ఒకపక్క ఎండలు మండిపోవడం, వర్షాలు కురవకపోవడంతో కైకలూరు నియోజకవర్గంలోని శివారు భూములకు నీరందక వరి పైరు ఎండిపోయే పరిస్థితులు కన్పిస్తున్నాయి. ఇప్పటికైనా జల వనరుల శాఖాధికారులు స్పందించి ప్రకాశం బ్యారేజీ నుంచి కైకలూరు నియోజకవర్గంలోని వ్యవసాయ భూములకు పూర్తిస్థాయిలో కాలువల ద్వారా సాగునీటిని సరఫరా చేయాలని, ఎండిపోతున్న పంట భూములను కాపాడాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

చినకామనపూడిలో ఎండిపోతున్న వరి చేలు

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కోట రామచంద్రాపురం ఐటిడిఎ పెరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించనున్న అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవానికి ఏజెన్సీ నలుమూలల నుంచి గిరిజనులు పెద్దఎత్తున తరలిరావాలని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు బర్రింకలపాడులోని క్యాంప్ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో గిరిజనుల సంస్కృతి, వారి జీవనశైలి, ఆచార సంప్రదాయాలను కళ్లకు కట్టినట్లుగా చూపించే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.

విచ్చేయనున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్

బుట్టాయగూడెం: అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం కోటరామచంద్రాపురంలోని ఐటిడిఎ పెరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 9వ తేదీ నిర్వహిస్తామని ఐటిడిఎ పిఒ రాములు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్, వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

విద్యుదాఘాతంతో పామాయిల్ కార్మికుడు మృతి

బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి

పామాయిల్, వ్యవసాయ కార్మిక సంఘాలు

ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని తాడువాయి గొల్లగూడెం చెరుకు ఫ్యాక్టరీ సమీపాన స్వర్ణవారిగూడెంలో పామాయిల్ గెలలు నరుకుతుండగా తడికిమళ్ల రమేష్ (30) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పామాయిల్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం వెంటనే ఘనట జరిగిన పామాయిల్ తోట ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నుంచి, ఫ్యాక్టరీ నుంచి రావాల్సిన ఎక్స్‌గ్రేషియా బాధిత కుటుంబానికి వచ్చేలా కృషి చేస్తామని, మృతుని కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి, విద్యుత్ డిపార్ట్‌మెంట్ నుంచి, ఉద్యాన శాఖ నుంచి రావాల్సిన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా నవభారత్ ఫ్యాక్టరీ వాళ్లు ట్రైనింగ్ క్యాంపు ఏర్పాటు చేసి గ్రూప్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.పది లక్షలు వ్యక్తిగత బీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు కరెంట్ లైన్‌లో ఉన్నప్పుడు ఎల్‌సి తీసుకుని పామాయిల్ గెలలు నరికించుకోవాలని, ఒకటి, రెండు గెలల గురించి పామాయిల్ గెలలు నరికే కార్మికులను పొట్టన పెట్టుకుంటున్నారని వాపోయారు. రెండు రోజుల క్రితమే టి.నరసాపురం గ్రామంలో ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడని చెప్పారు. ఇటీవల కాలంలో 20 మంది కార్మికులు విద్యుదాఘాతంతో చనిపోయారన్నారు. వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, పామాయిల్ కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఫ్యాక్టరీ చట్టం ప్రకారం రావాల్సిన సకల సౌకర్యాలు, ఇన్సూరెన్స్ వచ్చేలాగా చూడాలని కోరారు. చనిపోయిన కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, నవభారత్ ఫ్యాక్టరీ యాజమాన్యం మొద్దు నిద్ర వీడి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

రమేష్ మృతదేహం

పామాయిల్ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

పామాయిల్ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, వారిని కార్మికులుగా గుర్తించడం లేదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో పామాయిల్ తోటల్లో పనిచేసే కార్మికులు సుమారు పదివేల మంది ఉన్నారని, వీరిని ప్రభుత్వం కార్మికులుగా గుర్తించడం లేదని తెలిపారు. పామాయిల్ కార్మిక సంఘాన్ని పెట్టి వారికి అన్ని రకాల సౌకర్యాలు ప్రభుత్వాలు కల్పించాలని గత ఐదేళ్ల నుంచి వ్యవసాయ కార్మిక సంఘం అనేక రకాలుగా ఆందోళన చేసినా గత ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. ఏలూరు ఎంపీ పామాయిల్, కోకో రైతులకు పంట గిట్టుబాటు ధర కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడుతున్నట్లే ఆ తోటల్లో పనిచేసే బడుగు బలహీన తరగతులకు చెందిన పేదలు, వ్యవసాయ కార్మికులు, పామాయిల్ కార్మికులను ప్రభుత్వం గుర్తించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని పేర్కొన్నారు. ఉద్యాన వనశాఖ, కార్మిక శాఖ, విద్యుత్ శాఖ నిబంధనలు ఉన్నా జిల్లా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.

నిరుపేదలకు చేయూతగా సిఎం సహాయ నిధి

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

నాలుగు కుటుంబాలకు రూ.6.75 లక్షల విలువైన ఎల్‌ఒసిలు అందజేత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నిరుపేదల మెరుగైన వైద్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి చేయూతగా నిలుస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. పేదలకు మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం రూ.వేల కోట్లు కేటాయించిందని, ఆపత్కాలంలో ఉన్న నిరు పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సిఎం సహాయ నిధి అండగా నిలుస్తుందన్నారు. చాట్రాయి మండలం తుమ్మగూడెం గ్రామానికి చెందిన ఎం.రాంబాబు కుటుంబానికి రూ.1.75 లక్షలు, ఆగిరిపల్లి మండలం ఎస్‌ఎ.పేట గ్రామనికి చెందిన డి.గంగరాజు కుటుంబానికి రూ.50 వేలు, ముసునూరు మండలం కాట్రేనిపాడు గ్రామానికి చెందిన పి.సంధ్య కుటుంబానికి రూ.మూడు లక్షలు, ముసునూరు మండలం చెల్లిబోయిన గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వరరావు కుటుంబానికి రూ.1.50 లక్షలు మొత్తం నాలుగు కుటుంబాలకు రూ.6.75 లక్షల విలువైన ఎల్‌ఒసిలను మంత్రి శుక్రవారం అందించారు. తాము ఒక ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని, మెరుగైన వైద్యం కోసం మంత్రిని అడగగా ఆయన తక్షణమే ఎల్‌ఒసి పత్రాలు మంజూరు చేయించారని బాధిత కుటుంబాల వారు చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గానికి చెందిన పలువురు గతంలో వైద్యం చేయించుకుని ఉన్న బిల్లులతో సిఎం సహాయ నిధికి అర్జీ చేసుకోవచ్చన్నారు. గతంలో వైద్యం చేయించుకున్న వారు వైద్యం చేయించుకున్న బిల్లులను తమ కార్యాలయంలో అందిస్తే సిఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం వెంటనే అందిస్తామన్నారు. మెరుగైన వైద్యానికి కూటమి ప్రభుత్వం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తుందని చెప్పారు. ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య పరికరాలు, నిపుణులైన సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఎల్‌ఒసి పొందిన బాధిత కుటుంబాల వారు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



ఎల్‌ఒసి అందిస్తున్న మంత్రి పార్థసారథి

నేడు సిఐటియు మండల మహాసభ

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక మార్కెట్ యార్డులో సిఐటియు ఐదో మండల మహాసభ శనివారం నిర్వహించనున్నట్లు సిఐటియు మండల కార్యదర్శి జక్కుల మహేష్ తెలిపారు. ఈ మహాసభకు జిల్లా స్థాయి నాయకులు హాజరవుతున్నారని, వివిధ కార్మిక సంఘాల్లోని కార్మికులందరూ మహాసభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

పెదవేగి మండలం విజయరాయి సెక్షన్ కొప్పాక సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న అమ్మపాలెం, పెదకడిమి కొప్పాక, అంకన్నగూడెం గ్రామాలకు సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల తొమ్మిదో తేదీ శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కెఎం.అంబేద్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం ఎనిమిది గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి శ్యామలరాణి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మహిళలు, చిన్నారులపై దాడులను అరికట్టాలని ఐద్వా మహిళ సంఘం జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలరాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య కాలనీలో శుక్రవారం నిర్వహించిన అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కాలంలో మహిళలు, చిన్నారులపై దాడులు పెరిగాయన్నారు. అటువంటి దాడులకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పథకంలో భాగంగా సంవత్సరానికి మూడు గ్యాస్ బండ్లలో ఎక్కువమంది మహిళలకు రెండో బండ అందలేదన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరల వల్ల మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. బెల్ట్ షాపులను తొలగించాలని, లేకపోతే మహిళలతో కలిసి పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం మండల కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన జరిగే మండల మహాసభలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్.పార్వతి, కె.సరోజిని, లక్ష్మి, జయమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి శ్యామలరాణి

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి - చింతలపూడి

రక్తదానంతో మరో ప్రాణాన్ని కాపాడొచ్చని గోద్రెజ్ సంస్థ సిఇఒ సౌకథా నియోగి అన్నారు. శుక్రవారం గోద్రెజ్ వ్యవస్థాపకులు డాక్టర్ బిపి.గోద్రెజ్ జన్మదిన సందర్భంగా స్థానిక సీతానగరం గోద్రెజ్ పామాయిల్ ఫ్యాక్టరీలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సుమారు వంద మందికిపైగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన సిబ్బందిని డిప్యూన్నుగుప్తా, హెచ్‌ఆర్ సంపత్ శ్రీనివాసరావు, మౌళీశ్వరరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ పిఆర్‌ఒ కెవి.రమణ, మండల కోఆర్డినేటర్ పుల్లారి సోమశేఖరాచార్యులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న సిబ్బంది

సిపిఎం నేత సుబ్బారావు మృతి తీరని లోటు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సిపిఎం సీనియర్ నాయకులు, చిన్నాగిరిపల్లి గ్రామ శాఖ సభ్యులు మారుమూడి సుబ్బా రావు(75) మృతి ఉద్యమాలకు తీరని లోటని సిపిఎం ఆగిరిపల్లి మండల నాయకులు సత్తు కోటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని చిన్నాగిరిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నేత మారుమూడి సుబ్బారావు గురువారం ఉదయం ఆయన స్వగ్రామంలో వయోభారంతో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. ఆయన పార్టీ పిలుపులో భాగంగా పలు ఉద్యమాల్లో పాల్గొన్నారు. సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జె.రంగారావు, బి.మోహనరావు, టి.అర్జునరావు, ఎన్.బసవయ్య, ఎం.కవిత, కె.అరుణ, బి.రేణుక పాల్గొన్నారు.

జోహార్లు అర్పిస్తున్న నాయకులు

వరి చేలను పరిశీలిస్తున్న ఎంపిపి సత్యనారాయణ

వరి చేలకు వెంటనే సాగునీరందించాలి

ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

సాగునీరు అందక ఎండిన వరిచేలల్లో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని, పంటలు ఇప్పటికే బీటలు వాడుతున్నాయని, వెంటనే సాగు నీరందించాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ కోరారు. మండలంలోని చిగురుకోటలో ఎండిన వరి పొలాలను రైతులతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి సత్యనారాయణ మాట్లాడుతూ వెంటనే సాగు నీరందించకపోతే రైతులు పంటలను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎల్ఎ కామినేని శ్రీనివాసరావు వెంటనే స్పందించి పంట పొలాలకు నీరందించాలని కోరారు. నీరు పంట పొలానికి అందించకుండా సముద్రాలకు పంపేయడం వల్ల తమ పంట పొలాలకు సాగునీరు అందడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే యూరియా కొరత లేకుండా చూడాలని రైతులు కోరారు. నీరు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ విభాగం అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్, రామిశెట్టి కొండా, పోతుంబోయిన కనకదుర్గరావు, పార్టీ గ్రామ అధ్యక్షులు పేరం ధర్మ, అన్నే సురేష్‌కుమార్, కొంటి నాని, రామిశెట్టి అభిలాష్, తుమ్మ రామశాస్త్రి, బండారి మోహన్, పాల రంగారావు, బిరం మూర్తి, ఆకుల ఈశ్వర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

యాసిడ్ తరలిస్తున్న ఆటో బోల్తా

భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జీవనోపాధి కోసం యాసిడ్‌ను బంగారు దుకాణాలకు అమ్ముకుని ఒక కుటుంబం జీవిస్తుంది. యాసిడ్ పడి ఆ కుటుంబంలో ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన ఏలూరు జాతీయ రహదారిలోని పెదపాడు మండలం తాళ్లమూడి వంతెన సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పెదపాడు ఎస్ఐ శారదా సతీష్ తెలిపిన వివరాల ప్రకారం... గుంటూరుకు చెందిన షేక్ అల్లాబక్షు అతని భార్య షాంపార్ ఇద్దరు సంయుక్తంగా గుంటూరు నగరంలో యాసిడ్‌ను కొనుగోలు చేసి ఏలూరు నగరంలోని బంగారు దుకాణాలకు అమ్మి జీవనాన్ని సాగిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం గుంటూరు నుంచి ట్రక్కు ఆటోలో యాసిడ్ డబ్బాలను తరలిస్తున్నారు. భర్త ఆటోను నడుపుతూ ఉండగా భార్య ఆటోలో పక్కనే కూర్చుంది. తాళ్లమూడి వద్దకు వచ్చేసరికి ట్రక్కు ఆటో వెనుక టైర్ ఒక్కసారిగా పేలడంతో ఆటో బోల్తా పడింది. షాంపార్(48)పై ఎక్కువగా యాసిడ్ పడడంతో ఆమె శరీరభాగాలు కాలిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. అల్లాబక్షు 50 శాతం యాసిడ్‌లో కాలిపోయాడు. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన 108 సిబ్బంది అల్లాబక్షును చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న హైవే సేఫ్టీ సిబ్బంది రోడ్డుపై పడిన వాహనాన్ని పక్కకు తొలగించారు. అదే సమయంలో ఫైర్ సిబ్బంది కూడా ఘటన స్థలానికి చేరుకుని రోడ్డుపై పడిన యాసిడ్‌ను నీటితో కడిగి వేశారు. ఈ ఘటనపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

జాతీయ రహదారి నారాయణపురం - చేబ్రోలు మధ్య శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కైకరానికి చెందిన కోనే పవన్ నారాయణపురంలోని మోటార్ సైకిల్ షెడ్‌లో పని చేస్తున్నాడు. అతను శుక్రవారం సాయంత్రం పని ముగించుకుని బైక్‌పై నారాయణపురం నుంచి చేబ్రోలు బయలుదేరాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో రోడ్డు దాటుతున్న వేముల ఉమామహేశ్వరరావును బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉమామహేశ్వరరావుకు, బైక్‌పై ఉన్న పవన్‌కు ఇద్దరికి గాయాలయ్యాయి. ఇద్దరిని స్థానికులు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

యువకునిపై దాడి

ప్రజాశక్తి - ముదినేపల్లి

పాత గొడవలు పురస్కరించుకుని యువకునిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన సంఘటన మండలంలోని గురజలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన తోట చాణిక్య సాయి స్నేహితుడు పామర్తి జస్వంత్‌కు అదే గ్రామానికి చెందిన పోకల భగవాన్, వీరిశెట్టి వెంకటేష్‌లకు గతంలో పాత గొడవలు ఉన్నాయి. చాణిక్య సాయి స్నేహితులు పామర్తి జస్వంత్, సురేష్, ధనుష్, ప్రభు, వెంకటేష్, కార్తీక్, సుధీర్, మణికంఠ, నాగేశ్వరరావు, భరత్ గ్రామంలో ఉన్న కాలువలో మధ్యాహ్నం రెండు గంటల సమయంలో స్నానం చేస్తుండగా పోకల భగవాన్, వీరిశెట్టి వెంకటేష్ ఇద్దరు కాలువ వద్దకు వచ్చి జస్వంత్‌తో గొడవపడి తమ వెంట తెచ్చుకున్న రాడ్డుతో జస్వంత్ తలపై కొట్టగా గాయమైంది. దీంతో అక్కడ ఉన్న వారందరూ కేకలు వేయగా జస్వంత్ నీ అంత చూస్తామంటూ బెదిరించి అక్కడి నుంచి పరారయ్యారు. చాణిక్య సాయి స్నేహితులందరూ జస్వంత్‌ను గుడివాడ ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయిస్తున్నారు. చాణిక్య సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు, గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెదకామనపూడిలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు, గడ్డివామి దగ్ధమైంది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త పెరుమాళ్ల ప్రసాద్ ఇల్లు, గడ్డి వామి ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. కట్టు వస్త్రాలతో ప్రసాద్ కుటుంబం బయటపడింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ డైరెక్టర్ కొడాలి వినోద్ ఘటనా స్థలాన్ని సందర్శించి అగ్ని ప్రమాద బాధితులకు బొర్రా బాలసాయి ఛారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.పది వేల ఆర్థిక సాయం అందించారు. ప్రసాద్ కుటుంబానికి తెలుగుదేశంపార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

చెత్త సమస్యను పరిష్కరించరూ..!

రోడ్ల పక్కన, చెరువుల్లో చెత్త డంప్ చేస్తున్న వైనం
దుర్వాసనతో, దోమల విజృంభణతో ప్రజల అవస్థలు
అధికారులు పట్టించుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి - కుక్కునూరు

చెత్తను రోడ్ల పక్కన, చెరువుల్లో డంప్ చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కుక్కునూరు వాసులు వాపోతున్నారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు దుర్వాసన వెదజల్లుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులో నీరు కలుషితం అవుతుందని, మూగజీవాలు రోగాల బారి చనిపోతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. చెత్త వల్ల రోగాల బారిన పడుతున్నామని భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రమైన కుక్కునూరులో చికెన్ దుకాణాలు, సూపర్ మార్కెట్ల నుంచి పారిశుధ్య కార్మికులు సేకరించిన చెత్తను నిర్దేశిత డంపింగ్ యార్డుల్లో వేయకుండా రోడ్ల పక్కన, చెరువుల్లో డంప్ చేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో చెరువులో నీటి వనరులు కలుషితమవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. చెరువులోని చెత్త తినడం వల్ల మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాపయ్య చెరువు సమీపంలో చెత్త పేరుకుపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయని, వాటి కాటుకు గురై రోగాల బారిన పడి ఆసుపత్రుల పాలయ్యే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులో వేయకుండా రోడ్ల పక్కన, చెరువులో వేస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం గ్రామస్తులు వాపోతున్నారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు చెత్త నుంచి వచ్చే దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను అరికట్టేందుకు సమర్థవంతమైన చెత్త నిర్వహణ వ్యవస్థను అమలు చేయాలని, పంచాయతీ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్య కార్మికులు సేకరించిన చెత్తను రోడ్ల పక్కన, చెరువుల్లో వేయకుండా చర్యలు తీసుకోవాలని, నీరు కలుషితం కాకుండా, మూగజీవాలు మృత్యువాత పడకుండా, ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాలని గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ధర్మ గోవిందను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

రోడ్డు పక్కన చెత్త

చెరువులో పేరుకుపోయిన చెత్త

యుటిఎఫ్ నేతపై ఎస్‌టియు ఆరోపణలు సరికావు

ఎంఎల్ఎను కలిసి వివరించిన యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

యుటిఎఫ్ మండల నాయకుడిపై ఎస్‌టియు రాష్ట్ర, జిల్లా నాయకత్వం లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని యుటిఎఫ్ నేతలు అన్నారు. ఈ మేరకు యుటిఎఫ్ జిల్లా కోశాధికారి రంగమోహన్, జిల్లా కార్యదర్శి ఈడే శివశంకర్‌రావు, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ తేరా ప్రసాద్, ఇతర జిల్లా నాయకత్వం ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటిని శుక్రవారం ఆయన నివాసంలో కలిసి ఎస్‌టియు నాయకుల పొంతన లేని, సంబంధం లేని ఆరోపణలపై వివరణ ఇచ్చారు. యుటిఎఫ్ మండల నాయకుడు సభ్యత్వం కట్టనివారిని, ఎంఎల్‌సి చందా ఇవ్వని వారిని, అధికారులను, ఉపాధ్యాయులను తప్పుడు కథనాలతో వేధిస్తున్నారని ఎస్‌టియు నాయకులు చేసిన తప్పుడు ఆరోపణలను రాత పూర్వక ఆధారాలతో సహా యుటిఎఫ్ నాయకత్వం ఎంఎల్ఎకు సవివరంగా వివరించారు. వ్యవస్థాపరమైన లోపాల మీద మాత్రమే యుటిఎఫ్ పోరాడుతుందని, ఎవరైనా నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నప్పుడు మాత్రమే రెండు మూడు సార్లు మౌఖికంగా వారితో చర్చించి, వినని పక్షంలో కార్యవర్గంలో చర్చించి, కార్యవర్గ ఆమోదంతో, జిల్లా శాఖ అనుమతితో రాతపూర్వకంగా వినతిపత్రాలు, ప్రెస్‌నోట్స్ ఇస్తారని, ఇందులో వ్యక్తిగత స్వార్థం ఏమి ఉండదని, ఎవరిని ఎలాంటి సందర్భంలో వ్యక్తిగతంగా టార్గెట్ చేసిన సందర్భాలు లేవని, ఎవరిని చందాల కోసం వేధించింది లేదని వివరించారు. ఎలిమెంటరీ పాఠశాలలో బ్యాంకు అవకతవకలు బయట పెట్టినందుకు, ఓ ఉపాధ్యాయుడు ఎంఇఒ-1, 2 వారి అనుమతి లేకుండా వేరే పాఠశాలలో పనిచేయడాన్ని ప్రశ్నించినందుకు, పాఠశాల పని వేళల్లో ఉపాధ్యాయులను బోధనేతర పనుల్లో వినియోగిస్తున్నారని ఎంఇఒ-2ను వివరణ అడిగినందుకు తట్టుకోలేక మండల నాయకుడిపై వ్యక్తిగత దాడులకు పాల్పడుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఉపాధ్యాయులంటే తనకు ప్రత్యేక అభిమానమని, ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెరిగేలా ప్రయత్నించాలని సూచనలు చేశారు. ఈ విషయాలను ఉన్నతాధికారులతో మాట్లాడి సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఎంఎల్ఎతో మాట్లాడుతున్న యుటిఎఫ్ నేతలు

దసరా ఉత్సవాలపై మంత్రి సమీక్ష

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలో జరిగే దసరా ఉత్సవాలపై పట్టణ కిరాణా మర్చంట్ అసోసియేషన్ హాలులో అధికారులు, నాయకులు, కమిటీ సభ్యులతో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైసూర్ ఉత్సవాలు తలపించేలా నూజివీడు ఉత్సవాలు నిర్వహించాలని నాయకులకు, అధికారులకు సూచించారు. దసరా ఉత్సవాల్లో ఎటువంటి ఆటంకాలు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్య, తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. యాత్రికులకు తాగునీరు అందుబాటులో ఉంచాలని, మెడికల్ క్యాంపు నిర్వహించాలని చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ పి.సత్యనారాయణ, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు ఆర్.మురళీకృష్ణ కుమార్, టిడిపి పట్టణ అధ్యక్షులు ఎం.జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

గోర్ బంజారా ఆధ్వర్యాన ఘనంగా తీజ్ పండుగ

తీజ్ పండుగలో గ్రామస్తులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో గోర్ బంజారాలోని పెళ్లికాని ఆడ బిడ్డలు తొమ్మిది రోజుల పాటు జరుపుకునే తీజ్ పండుగను మండలంలోని కృష్ణాపురంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలంతా పాడి పంటలు, సిరి సంపదలతో పాటు సుఖ సంతోషాలతో అభివృద్ధి చెందాలని కోరుకుంటూ భక్తి శ్రద్ధలతో నిర్వహించే పండుగను తీజ్ అంటారని తెలిపారు. మేరామా, తులజా, సీతలా, హింగ్లా మొదలగు ఏడుగురు భవానీలను పూజిస్తూ గోర్ బంజారా ఆడ బిడ్డలు చేసుకునే పండుగ అని చెప్పారు. సంఘ అధ్యక్షులు ఎం.శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ ఆడపిల్లలు పుట్టింటికి, మెట్టినింటికి కీర్తి ప్రతిష్టలు తెచ్చేలా వారిలో నైతిక, సామాజిక విలువలను నేర్పుతూ, వారిలో మనోధైర్యంతో జీవించే లక్షణాలను పెంచేందుకు తీజ్ పండుగ ఉపయోగపడుతుందన్నారు. సంఘ కోశాధికారి ధరావతు రవినాయక్ మాట్లాడుతూ గోర్ బంజారా ఆడబిడ్డల కలలను, ఆశలను తీజ్ ఫలింపజేస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉండే గోర్ బంజారా ఆడబిడ్డలు ఈ పండుగను చేసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశావత్ వెంకట్, భూక్యా సత్యం, భూక్యా ధనలక్ష్మి, జరభల కృష్ణలీల, భూక్యా సునీల్, గుగులోతు బాబు, లావుడియా సంధ్య, జరభల పద్మ, భూక్యా భద్రమ్మ, భూక్యా వెంకమ్మ, భూక్యా నీరజ, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : చింతమనేని

ప్రజాశక్తి - దెందులూరు

గ్రామాలు అభివృద్ధి చెందాలంటే మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదపాడు మండలం పెదపాడు గ్రామంలోని ఎస్‌సి కాలనీలో డ్రెయిన్ల నిర్మాణ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ అంశంపై అధికారులతో, సిబ్బందితో శనివారం సమీక్షించి కాలనీలో సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు చేపడతామని కాలనీవాసులకు ఎంఎల్ఎ భరోసా ఇచ్చారు. గ్రామాల్లో డ్రెయిన్లు, రోడ్ల సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి పరిష్కరిస్తున్నామన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను కూడా సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

ఆక్వా రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆక్వా రైతులను కేంద్ర, రాష్ట్ర ఆదుకోవాలని పలు ఆక్వా రైతులు కోరారు. మండలంలోని చిగురుకోటలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆక్వా రైతులు మాట్లాడుతూ భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 50 శాతం సుంకాలు విధించడంపై ఆక్వా రంగం ఒడిదుడుకులకు గురైందన్నారు. మొత్తం 50 శాతం పన్ను భారం పడడంతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రైతుల సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ఆక్వా ఎగుమతుల వల్ల విదేశీ వాణిజ్యం పొందే కేంద్రం తక్షణమే స్పందించి ఆక్వా రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, దీనిపై కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆక్వా రైతుల కృషి వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం కూడా వస్తుందన్నారు. పన్నుల రూపంలో విదేశీమారక ద్రవ్యం రూపంలో వేల కోట్లు ఆదాయాలు ప్రభుత్వాలు పొందుతున్నాయన్నారు. కాని ఆక్వా రైతులు మాత్రం తీవ్ర నష్టంలో ఉన్నారన్నారు. ఆక్వా ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన పన్నులను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, పన్నుల సాకుగా చూపిస్తూ ప్రాసెసింగ్ యూనిట్లు రొయ్య రైతులను నిలువునా దగా చేస్తున్నాయని మండిపడ్డారు. ధరలు తగ్గించే అధికారం ప్రాసెసింగ్ యూనిట్లకు ఎవరిచ్చారని ఎంపిపి ప్రశ్నించారు. ప్రభుత్వమే మద్దతు ధర నిర్ణయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆక్వా రైతులంతా కలిసికట్టుగా సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. ప్రభుత్వం విద్యుత్ రాయితీ, నాణ్యమైన సీడ్స్ సరఫరా, ఫీడ్ ధరల నియంత్రణ వంటి అనేక హామీలు నెరవేర్చాలన్నారు. ముడి సరకు ధర పెరిగినప్పుడు ఫీడ్ కంపెనీలు ఫీడ్ రేట్లను గణనీయంగా పెంచుతున్నాయని పలువురు ఆక్వా రైతులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆక్వా రైతులు రామిశెట్టి ప్రసాద్, రామిశెట్టి అభిలాష్, తుమ్మ రామశాస్త్రి, పిట్టు నాగేంద్ర, పోతుబోయిన కనకదుర్గరావు, పార్టీ గ్రామ అధ్యక్షులు పేరం ధర్మరాజు, రామిశెట్టి అశోక్, ఆకుల ఈశ్వర్, కొంటి నాని, అన్నే సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి, ఆక్వా రైతులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - భీమడోలు

ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ విషయమై ట్రాఫిక్ నిబంధనలను అమలు చేస్తూ పోలీసులకు ప్రజలు సహకరించాలని భీమడోలు సిఐ యుజె విల్సన్ కోరారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భీమడోలు సిఐ ఆధ్వర్యంలో పోలీసులు, రవాణా శాఖ, జాతీయ రహదారులకు చెందిన అధికారులు సంయుక్త కార్యాచరణ కమిటీగా ఏర్పడి, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై భీమడోలు మండల పరిధిలోని జాతీయ రహదారులపై క్షేత్రస్థాయి సమీక్షను శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. రహదారి ప్రమాదాల నివారణకు కమిటీ జాతీయ రహదారుల శాఖకు సమర్పించేందుకు కొన్ని ప్రతిపాదనలను సిద్ధం చేశారు. దీనిలో భాగంగా ప్రమాదాలకు కారణమైన బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు, ఇంజినీరింగ్ లోపాలు, అ సమానమైన రోడ్డు ఉపరితలాలు, తగిన డివైడర్లు లేకపోవడం, రాత్రి సమయాల్లో ఎక్కువ ప్రమాదంలో జరిగే ప్రాంతాల్లో లైటింగ్ లేకపోవడం, దీంతో పాటు ప్రమాద సూచికలు, స్పీడ్ బ్రేకర్లు వంటి భద్రతా అంశాల ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతలను గుర్తించారు. వీటిని జాతీయ రహదారుల శాఖకు కమిటీ అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు, ద్వారకాతిరుమల ఎస్ఐలు సుధాకర్, సుధీర్, రవాణా శాఖ సహాయ ఇన్‌స్పెక్టర్ ప్రజ్ఞ, జాతీయ రహదారుల శాఖకు చెందిన ఇంజినీర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'విద్యాశక్తి' నిర్బంధం తగదు

ఎపి ఎస్‌టిఎ రాష్ట్ర అధ్యక్షులు కాడిశెట్టి శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యాశక్తి కార్యక్రమాన్ని నిర్బంధం చేయడం తగదని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఎపి ఎస్‌టిఎ) రాష్ట్ర అధ్యక్షులు కాడిశెట్టి శ్రీనివాసులు అన్నారు. ఏలూరులోని జిజె రెసిడెన్సీలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశక్తి కార్యక్రమం ఐచ్చికంగా నిర్వహించాలని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ తెలియజేశారని, కాని కొన్ని జిల్లాల్లో విద్యాశక్తి కార్యక్రమాన్ని నిర్బంధంగా నిర్వహించమనడం సరికాదని చెప్పారు. సాధారణంగా విద్యార్థులు సాయంత్రం నాలుగు గంటలకు మానసికంగా అలసిపోతారని, ఆ సమయంలో విద్యాశక్తి అని చెప్పి ఆదనంగా తరగతులు నిర్వహించడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. విద్యాశక్తి కార్యక్రమం గురించి ఎవరినీ నిర్బంధం చేయవద్దన్నారు. ఇప్పటికే చాలామంది ఉపాధ్యాయులు అదనపు తరగతులు నిర్వహించి,వారి సిలబస్‌ను పూర్తిచేసి, వెనుకబడిన విద్యార్థులకు రెమిడియల్ తరగతులు నిర్వహిస్తున్నారాన్నరు. అలాగే అకడమిక్ ఫోరం వల్ల ఉపాధ్యాయులు బోధనకు దూరం అవుతారని, డిఇఒ, ఎంఇఒ, డైట్ లెక్చరర్లు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షణకు ఉండగా అకడమిక్ ఫోరమ్ అవసరం లేదన్నారు. అకడమిక్ ఫోరంలు తప్పని సరైతే సీనియర్ ఉపాధ్యాయులను ఎంపిక చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జిజెఎ.స్టీవెన్, జిల్లా అధ్యక్షులు కాటి వెంకట రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట ప్రసాద్, పాల్గొన్నారు.

'రిజర్వేషన్లపై ప్రభుత్వం పునరాలోచించాలి'

ఆగిరిపల్లి :మాదిగలకు ఆరు శాతం రిజర్వేషన్లు కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని, ఆర్డినెన్స్ ద్వారా కాకుండా పార్లమెంట్‌లో చట్టం చేయాలని ఎపి ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఆగిరిపల్లిలోని షాదీఖానాలో ఉమ్మడి ఎపి ఎంఆర్‌పిఎస్ ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తల రౌండ్ టేబుల్ సమావేశం ఆ సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి మంగలపూడి నాగేశ్వరరావు మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు గురివిందపల్లి చిట్టిబాబు మాదిగ, కె.గంగాధర్, పి.కమాలకర్, కె.ప్రదీప్ కుమార్, యు.కృపారావు, కె.సుధాకర్, ఎస్.సాధు సుందర్ సింగ్, ప్రశాంతి పాల్గొన్నారు.

చింతలపూడి ఎత్తిపోతలతోనే మెట్ట ప్రాంతం అభివృద్ధి

దారి దీపం ప్రధాన సంపాదకులు వర్మ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

చింతలపూడి ఎత్తిపోతల పథకంతోనే జిల్లాలో మెట్ట ప్రాంతం అభివృద్ధి చెందుతుందని దారి దీపం ప్రధాన సంపాదకులు డివివిఎస్.వర్మ అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా సమగ్రాభివృద్ధిపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అధ్యక్షత వహించారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా హాజరైన డివివిఎస్.వర్మ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం అధ్యయనం చేసి జిల్లా అభివృద్ధికి తగిన ప్రణాళిక రూపొందించాలని సూచించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయడం ద్వారా ఆయకట్టు స్థిరీకరణతో పాటు తాగు, సాగునీరు పుష్కలంగా లభిస్తాయన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ సిపిఐ శత వార్షికోత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మహాసభ జరుపుతున్నామని, ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభలో జిల్లా సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేకంగా చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ సదస్సులో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు, జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లుల విడుదల హర్షణీయం

ప్రజాశక్తి - ముసునూరు

2018, 2019 సంవత్సరాల్లో ఎన్‌టిఆర్ గృహ కల్ప కింద ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేయడం పేదలకు ఆర్థిక చేయూత ఇచ్చినట్లు అవుతుందని వేంపాడు మేజర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ రాపర్ల బాలకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 2018-19లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలకు బిల్లును చెల్లించకుండా నిలుపుదల చేయడంతో వారు తీవ్ర నిరాశకు గురై అప్పులపాలయ్యామని వేడుకున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 2024లో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీసుకెళ్లారు. గత ప్రభుత్వం 2018-19లో ఇల్లు నిర్మించుకున్న పేదలకు బిల్లులు చెల్లించలేదని తెలపడంతో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని లబ్ధిదారులకు రూ.6.50 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. టిడిపి సీనియర్ నాయకులు బొమ్మకంటి శ్యామలరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అన్ని పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యదేవర శ్రీనివాసరావు, రాపర్ల ప్రతాప్, గద్దల మోహనరావు, గుడిపాటి అజాయ్, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE
IN THE COURT OF THE VII ADDL DISTRICT JUDGE, (FAMILY COURT) ELURU.
A.S.No.34/2024

Between:
Vadlapatla Venkata Subbarao ...Appellant
And
Velamati Krishna Gandhi Chowdary & Others ...Respondents

To.
R1 : Velamati Krishna Gandhi Chowdary, S/o.Late Bhupathi, R/o.H.No.2-64, Moturuvari Street, Denduluru, West Godavari District.

Where as, the appellant has filed appeal against the decree and judgment dated **20.12.2018 in O.S.No.273/2018** on the file of Addl. Senior Judge's Court, Eluru, Where as the Hon'ble Court ordered notice to you and posted the matter for your appearance. Therefore, you are called upon to appear before the Hon'ble Court on **18.08.2025 at 10.30 A.M.,** and state your objections if any, else the matter will be decided in your absence.

PYDI VENKATA RAJU,
Advocate, Eluru.
Cell: 9885199811

దావా సమన్సు (Or. 5R, 1 & 5)
చీరాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో,
O.S.No. 19/2025

Between:
బ్యాంక్ ఆఫ్ బరోడా, చింతగుంపల్లి
rep.by its Branch manager ....వాది
V/s.
శ్రీమతి కల్లపల్లి రామలక్ష్మి ...... ప్రతివాది

To:
శ్రీమతి కల్లపల్లి రామలక్ష్మి, భర్త తరుణ్,
నివాసం ఇసుకవాగు సెంటర్,
అంకమ్మ గుడి ప్రక్కన, ఒంగోలు,
ప్రస్తుత నివాసం డోర్ నెం:4-12,
యర్రావుల వీధి, చేబ్రోలు, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబర్ దావాని వాది అయిన బ్యాంకు వారు ప్రతివాది అయిన నీనుండి బ్యాంకుకు రావలసిన లోను బకాయిని రాబట్టుకొను నిమిత్తం దాఖలు చేసియున్నారు. ఇందు నిమిత్తమై ప్రతివాది అయిన నీకు ఏమయినా అభ్యంతరములు ఉన్న యెడల ది.03-09-2025 వ తేదిన ఉదయం 10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా వకీలు గారి ద్వారా గాని హాజరై మనవి చేసుకొన వలెను లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియచేయుటమైనది.

కోర్ట్ వారి ఆదేశాల ప్రకారము ప్రకటన జారి చేయువారు
బండారుపల్లి హేమంత్ కుమార్
అడ్వకేట్ & నోటరి (భారత ప్రభుత్వం)
చర్చి కాంపౌండ్, చీరాల - 523157

ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)వారి కోర్టులో, తాడేపల్లిగూడెం
I.A.670/2025, I.A.671/2025
I.A.672/2025 in O.S.No.48/2018

తమ్మా పాపారావు (Died) మరికొందరు ...పిటీషనరు/వాది
మరియు
బందెల అరవ వెంకట సత్యనారాయణ అనే అరవరాజు ...రెస్పాండెంటు/ప్రతివాది

ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా పై నెంబరు దావా గ్రంథములోని వాది అయిన శ్రీ తమ్మా పాపారావు (Died) మరియు తమ్మ కనకమ్మ, W/o.తమ్మా పాపారావు, హిందూ, స్త్రీ, వయస్సు 56 సంIIలు, రామచంద్రపురం, పెంటపాడు (మం), పశ్చిమ గోదావరి జిల్లా మరియు మరికొందరు బందెల అరవ వెంకట సత్యనారాయణ అనే అరవరాజు, S/o.సుబ్బారావు, D.కుముదవల్లి (V), గణపవరం మండలం, ప.గో.జిల్లా అనువారిపై దావా దాఖలు చేయగా వారికి ఎన్నిసార్లు దావా నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుటకు ప్రయత్నించుచున్నందున వారికి పేపరు పబ్లికేషను ద్వారా సమన్లు అమలు జరిపించుటకు శ్రీకోర్టు వారు అనుమతి ఇచ్చినందున సదరు దావా గ్రంథము ది.21-08-2025 సంII తేదీన వాయిదా ఉన్నందున మీరు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని వకీలు ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియపరచుకొనవలెను. లేనిఎడల మీ పరోక్షమున పైనెంబరు దావా తీర్మానించబడునని తెలియ చేయడమైనది.

పైకోర్టు వారి ఉత్తర్వులతో
కొండేపాటి వెంకటేశ్వరరావు
అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
సెల్: 98483 55344